


# హేబిట్

— తిమ్మన శామ్‌సుందర్ నాయుడు

"మనిషన్నాక పుట్టిన ఊరి మీద కాస్తైనా మమకారం వుండాలి..."

సుబ్బారావు అన్న ఆ మాటకి ఫైల్లో నుంచి తలెత్తి చూశాడు మూర్తి. అతనా మాట ఉన్న పళంగా ఎందుకన్నాడా అన్నట్లు.

కాని అతని నోటి నుంచి మరో మాట రాకపోవడంతో మళ్ళీ ఫైల్లోకి దూరిపోయాడు.

"జన్మ భూమిని గౌరవించని మనిషి అసలు మనిషేనటోయ్??..." మళ్ళీ అన్నాడు సుబ్బారావు.

ఉలిక్కిపడ్డాడు మూర్తి.

"సుబ్బారావుకి వేళ ఏమయిందబ్బా!!..." అనుకున్నాడు.

అతను మళ్ళీ ఏమనబోతున్నాడా అన్నట్లు చూశాడు. కాని ఈసారి అతను పూర్తిగా ఫైల్లో మునిగిపోవడంతో ఒక నిట్టూర్పు విడిచి తానూ తన ఫైల్లో తల దూర్చాడు.

లంచ్ అవర్లో క్యారియర్ ఓపెన్ చేస్తున్న సుబ్బారావు దగ్గరకి చేరిన మూర్తి "ఏంటోయ్,ఇందాక నీలో నువ్వు కాసేపు ఏదో మాట్లాడుకున్నావ్? ఒంట్లో బాగోలేదా?" అనడిగాడు.

"నా ఆరోగ్యానికేమోయ్! మా ఆవిడ దయ వల్ల బాగానే వుంది కాని ఈ మనుష్యుల స్వభావమే బొత్తిగా నచ్చడం లేదు..." అన్నాడు ఒకింత విరాగ్గా.

సాధారణంగా తన ఫైలు, తన పెన్ను, తన సంతకం మాత్రమే పట్టించుకునే సుబ్బారావు తన ప్రక్క మనుషుల్ని పట్టించుకోవడంతో చాలా ఆశ్చర్యమేసింది మూర్తికి. సుబ్బారావు కోపానికి కారణమేంటాని కాసేపు వెతుక్కున్నాడు. కాని దానికంటే తనకి కనిపించకుండా పోయిన పాత ఫైలుని వెదుక్కోవడమే చాలా తేలికనిపించింది అతనికి.

భోజనం ముగించిన తరువాత ట్యాప్ దగ్గరకెళ్ళి చేతులు కడుక్కుంటూ సుబ్బారావు ట్యాప్ లో నుంచి వస్తున్న నీళ్ళను చూపిస్తూ "కోనసీమ నీళ్ళు ఈ నీళ్ళకన్నా స్వచ్ఛంగా వుంటాయిటోయ్? " అనడిగాడు.

తమ ఆఫీసు ట్యాప్ నీళ్ళకీ, ఎక్కడో అల్లంత దూరాన వున్న కోనసీమ నీటికీ తేడాని గమనించమనడంతో అయోమయంలో పడ్డాడు మూర్తి.

నేప్‌కిన్‌తో చేతులు తుడుచుకున్న తరువాత సుబ్బారావు, ఓ వార పత్రికను తెచ్చి మూర్తి చేతిలో పెడుతూ "ఇందులో ఇరవై నాలుగో పేజీలోని కథ చదవ్వోయ్!" అన్నాడు.

గబగబ పేజీలు తిప్పిన మూర్తి, "ఈ కథ నేనెప్పుడో చదివేసానోయ్, చాలా బాగుంది" అన్నాడు ఆ పత్రికను తిరిగి సుబ్బారావు చేతిలో పెట్టేస్తూ.

కథ ఓగుందనడంతో "మరి కథలో రచయిత ఎన్నుకున్న లొకేషన్??.." ప్రశ్నించాడు సుబ్బారావు, మూర్తి కళ్ళలోకి గుచ్చి గుచ్చి చూస్తూ.

"అబ్బ! దానికేం గురూ? కోనసీమని లొకేషన్‌గా ఎన్నుకోవడంలోనే రచయిత టేస్ట్ ఎంత గొప్పదో అర్థమవుతుంది. నిజమైన ప్రాకృతిక సౌందర్యం కోనసీమదే గురూ!..."

అతని మాటలు పూర్తికాకముందే సుబ్బారావు ఒక్కసారిగా "స్టాపిట్!" అని అరవడంతో గతుక్కుమన్నాడు మూర్తి.

దరికీ కోనసీమని మెచ్చుకోవడం ఫ్యాషనైపోయింది. ఎక్కువ మంది రచయితలు కోనసీమ, ఆ పరిసర ప్రాంతాలకు చెందినవాళ్ళు కావడం వలన తమ ప్రాంతాన్ని ఎలివేట్ చేస్తూ రచనలు చెయ్యడం వలన మాత్రమే కోనసీమకి అంత పేరు వచ్చింది తప్ప ప్రకృతి సౌందర్యం మొత్తం అక్కడే కేంద్రీకృతమయ్యిందని అంటే మాత్రం నాక్కోపం వస్తుంది తెలుసా?..." అన్నాడు ఎంతో ఆవేశంగా.

సుబ్బారావు కోపంతో కొడుతున్న బుసలు రాజమండ్రి స్టేషన్ నుంచి బయల్దేరడానికి సిద్ధంగా వున్న రైలు ఇంజన్ పొగ శబ్దంలా అనిపించింది మూర్తికి.

"కోనసీమ గురించి అలా వ్రాసి వ్రాసి రీడర్స్‌లో ఆ ప్రాంతమంటే ప్రత్యేకమైన అభిమానాన్ని ఇంజెక్ట్ చేశారు తప్ప అంతకంటే సుందరమైన ప్రాంతాలు ఆంధ్ర దేశంలో అనేకం వున్నాయి తెలుసా?

కోనసీమకి అంత క్రేజ్ అనవసరంగా వచ్చిందని సుబ్బారావు భావిస్తున్నట్టు గ్రహించిన మూర్తి "మరైతే వాటినే

ఎలివేట్ చేస్తూ ఎందుకని రచనలు చెయ్యలేకపోతున్నారు ప్రస్తుత రచయితలు?" అనడిగాడు.

"ఎందుకంటే వాళ్ళంతా అనుభవానికి లోనై రచనలు చెయ్యలేకపోవడమే కారణం!..." వెంటనే బదులిచ్చాడు సుబ్బారావు.

కోనసీమంటే సుబ్బారావుకి అంత ఏవగింపు కలిగినందుకు బాధపడ్డాడు మూర్తి. కోనసీమని అభిమానించని తెలుగువాడుండడని అతని నమ్మకం. కోనసీమ అనగానే వెంటనే అమలాపురం గుర్తుకొచ్చి అతని హృదయం తీయగా మూలిగింది. తను ప్రత్యేకంగా ఆ ప్రాంతాన్ని చూడకపోయినా ఆ ప్రాంతమంటే తనకి ఏదో తెలీని అనుబంధం వుందని భావించే మూర్తి, సుబ్బారావు అసలు ఉద్దేశం తెలుసుకుందామని–

"ఇంతకీ ఏమంటావ్?" అనడిగాడు.

"కోనసీమకంటే రమణీయమైన సౌందర్యం గల ప్రదేశం మరోటుందని రీడర్స్‌కి తెలియజేస్తూ ఒక కథ వ్రాయదలుచుకున్నాను..."

బిత్తరపోయిన మూర్తి వెంటనే తేరుకుని "ఎక్కడుందా ప్రదేశం? అది ఏ ఊరు?" అనడిగాడు ఉత్సుకతతో.

"మన ఊరే..." అంటూ నవ్వాడు సుబ్బారావు.

కోనసీమ కొబ్బరి బొండాలంత పెద్దగా విచ్చుకున్నాయి మూర్తి కళ్ళు ఆశ్చర్యంతో ఆ సమాధానం విన్నాక.

"అప్పాపురమా??..." అంటూ అత్యంత ఆశ్చర్యంతో అడిగాడు వెంటనే.

అవునన్నట్లు తలూపాడు సుబ్బారావు.

"అందమైన భాషను ఉపయోగించి, దానికి కావలసినంత భావుకతను జోడించి, అతిగా వర్ణించినంత మాత్రాన అప్పాపురం అమలాపురం కంటే అందమైనదైపోద్దా ఏంటి...?" ఆశ్చర్యంలో నుంచి తేరుకుంటూ తన సందేహాన్ని వెలిబుచ్చాడు మూర్తి.

ఆ సమయంలో మూర్తి చాలా అమాయకంగా అనిపించాడు సుబ్బారావుకి. అతని సందేహానికి చిన్నగా నవ్వుకుని "కోనసీమ కూడా అంతే!" అని బదులిచ్చాడు.

ఆ సమాధానంతో ఉలిక్కిపడ్డ మూర్తి, "సుబ్బారావుకి ప్రాంతీయ దురభిమానం ఇంతగా పెరిగిపోయిందేంటబ్బా??" అనుకున్నాడు క్వశ్చన్‌మార్క్ ఎక్స్‌ప్రెషన్‌తో.

మూర్తికి మరింత వివరణ ఇస్తూ సుబ్బారావు, "అందుకే అనుభవానికి లోనైన తరువాత మాత్రమే ప్రతి రచయితా రచనలు చెయ్యాలనేది. మన ఊరు ఎంతటి రమణీయ సౌందర్యం కలిగిఉన్నదో ఎవ్వరికీ తెలీదు. కారణం... ఎవ్వరూ గమనించకపోవడమే" అన్నాడు.

మూర్తి ఆశ్చర్యంగా వినసాగాడు.

"ఆ అందాన్ని నేను గమనించాను. కథని ఎంత రసవత్తరంగా వ్రాస్తానో చూడు. నా కథ అచ్చయిన తరువాత కోనసీమ అనేది ఒకటుందని రీడర్స్ అందరూ మరచిపోవాలి. మిగతా రచయితలందరూ ఇకనుంచి తమ రచనల్లో అప్పాపురాన్నే నేపథ్యంగా తీసుకుని రచనలు సాగించాలి. వస్తా..." అంటూ అక్కణ్ణుంచి చకచకా వెళ్ళిపోయాడు.

తన తాతగారి పేరు అప్పారావని, అప్పాపురం అనేది తమ తాతగారి పేరు మీద ఎవ్వడో చాలాకాలం క్రితం పెట్టబడిన పేరని తనతో సుబ్బారావు అప్పడప్పుడు అంటుండే విషయం సడెన్‌గా గుర్తుకొచ్చింది మూర్తికి.

"ఓహో! అంటే ఇది అప్పాపురం కంటే కూడా అప్పారావుగారి మీదున్న అభిమానం అన్నమాట!..." అనుకుంటూ విస్మ్రయించాడు తనలో తనే గొణుక్కుంటూ.

* * *

సాయంకాలం నీరెండలో చెరువు గట్టు మీద తాటి చెట్టునానుకుని కూర్చుని దక్షిణపు దిక్కు నుండి వీస్తున్న చల్లని గాలిలో తన్మయత్వంగా కళ్ళు మూసుకుని తన్ను తాను మరచిపోయిన సుబ్బారావు ఒడిలోని తెల్ల కాగితాలు అతని ఆనందమే తమ ఆనందం అన్నట్లుగా రెపరెపలాడసాగాయి.

ప్రతిరోజూ ఉదయం సాయంత్రం అప్పాపురం పొలాల మధ్య నడుస్తూ ఆ అందమైన ప్రాంతానికి అక్షర రూపం కల్పించసాగాడు సుబ్బారావు.

అమలాపురం ఆకాశం కంటే అప్పాపురం ఆకాశమే అందంగా వుంటుందని అతని నమ్మకం.

కథలో అప్పాపురం అందాల్ని సందర్భోచితంగా ఎక్కిస్తూ కథా రచన పూర్తి చేసి ఓ మంచి రోజున పత్రికాఫీసుకు పోస్ట్ చేశాడు.

* * *

"ఐతే నీ కథ సెలక్టవుతుందంటావ్?" అనుమానం నిండిన ఎక్స్‌ప్రెషన్‌తో అడిగాడు మూర్తి. సుబ్బారావు ఆ కథని పోస్ట్ చేసానని చెప్పగానే.

"ఖచ్చితంగా!" చాలా కాన్ఫిడెన్స్‌తో బదులిచ్చాడు సుబ్బారావు.

పైగా కథను వ్రాయడానికి తనెంత కష్టపడిందీ, అప్పాపురం అందాల్ని ఏ విధంగా కథలో ఉపయోగించుకుందీ కూలంకషంగా చెప్పాడు.

కాని మూర్తికి మాత్రం అనుమానంగానే వుంది. సుబ్బారావు ఈ విషయంలో ఖచ్చితంగా దెబ్బ తింటాడనీ, అతని కథ తిరిగొస్తుందనీ, అప్పడే అతనితో దానికి గల కారణాలను విశ్లేషించవచ్చనీ ఆ రోజు కోసం ఎదురుచూడసాగాడు.

కాని తను అనుకున్నట్లుగా కాకుండా ఆ కథ సెలెక్ట్ అయినట్లు పత్రికాఫీసు నుంచి ఉత్తరం రావడంతో బిత్తరపోయాడు.

"ఇప్పుడేమంటావోయ్ మూర్తీ! పత్రికోళ్ళు కోనసీమకంటే అందమైన లొకేషన్ మరోటుందని నా కథ ద్వారా తెలుసుకోవడం వల్లనే కదా దాన్ని సెలెక్ట్ చేసుకున్నారు? ఇక కథ అచ్చయిన తర్వాత చూడు, కథా ప్రపంచంలో ఓ నూతనాధ్యాయం మొదలవుతుంది..." అన్నాడు ఆ సందర్భంగా కాఫీ ఇప్పిస్తూ.

ఆ క్షణంలో సుబ్బారావు ఓ అద్భుతమైన వ్యక్తిలా కనబడ్డాడు మూర్తికి. అతనికి సుబ్బారావు మీద ఒక్కసారిగా ఎనలేని అభిమానం పెరిగిపోయింది.

'నిజంగానే కోనసీమకంటే అప్పాపురమే అందంగా వుంటుందిగామోలు...!' అనుకున్నాడు.

ఇన్నాళ్ళూ కోనసీమని ప్రేమించినందుకు చాలా పశ్చాత్తాపపడిపోయాడు కూడా.

ఆ తరువాత వారమే కథ అచ్చుకావడంతో పత్రికను తీసుకొచ్చి మూర్తి చేతిలో పెట్టాడు సుబ్బారావు.

అతనికి తెలీకుండానే అతని మీసాలు ఎవరో తిప్పినట్లుగా పైకి లేచాయి.

కథ పూర్తిగా చదివిన మూర్తి దాని మీద ఎటువంటి అభిప్రాయాన్ని వ్యక్తం చెయ్యకుండా స్తబ్ధుగా వుండిపోవడంతో చిరునవ్వు నవ్వాడు సుబ్బారావు. తను కథని అంత గొప్పగా వ్రాస్తానని ఊహించి వుండని మూర్తి షాక్ తిన్నాడని అతనికి అర్థమైంది.

నెమ్మదిగా మూర్తి దగ్గరకెళ్ళి అతని భుజం మీద చెయ్యేసి "దటీజ్ సుబ్బారావ్!" అంటూ కనుబొమ్మలెగరేసాడు గర్వంగా.

ఈ తరువాత వారమే తనూహించిన దానికంటే ఎక్కువగా రీడర్స్ నుంచి కుప్పలు తెప్పలుగా ఉత్తరాలు రావడంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు సుబ్బారావు. పత్రికాఫీసుకి వచ్చిన ఆ ఉత్తరాల్ని తన అడ్రస్‌కు రీ డైరెక్ట్ చేసినందుకు ఆ ఎడిటర్‌కి మనసులోనే

**కొత్త పాలవాడు**

పాలుపోసే రామయ్య వెంట తన కొడుకును కూడా తీసుకువచ్చాడు.

"ఏం రామయ్యా! నీ కొడుకుని ఇక పాల వ్యాపారంలో దింపేస్తావా? ఇంతకీ ఏం పేరు?" అని అడిగాడు గుర్నాథం.

"మావాడికి నా అభిమాన హాలీవుడ్ నటుడు 'పాల్ న్యూమాన్' పేరు పెట్టుకున్నానండీ!" అన్నాడు రామయ్య.

– గాయత్రి



కృతజ్ఞతలు చెప్పకుంటూ ఒక ఉత్తరాన్ని ఓపెన్ చేశాడు.

అది హైదరాబాద్ నుంచి ఒక పాఠకుడు వ్రాసింది...

"ఎడిటర్ గారికి నమస్కారం! గత సంచికలో మీరు ప్రచురించిన 'డామిట్! కథ అడ్డం తిరిగింది' అను కథలో రచయిత సుబ్బారావుగారు వర్ణించిన ప్రకృతి సౌందర్యానికి ముగ్ధులైపోయాను. కోనసీమ ప్రాంతాన్ని అంత రమణీయంగా వర్ణించిన సుబ్బారావుగారికి అభినందనలు తెలియజేస్తున్నాను..."

ఉలిక్కిపడ్డాడు సుబ్బారావు.

"నేను వ్రాసింది అప్పాపురం గురించైతే ఇతను కోనసీమ అంటాడేంటబ్బా? కథని ఎలా చదవాలో కూడా తెలీదులా వుంది ఇతనికి!!" అనుకుంటూ తిరుపతి నుంచి వచ్చిన ఉత్తరాన్ని తీసాడు.

అందులో...

"సుబ్బారావుగారి 'డామిట్! కథ అడ్డం తిరిగింది' కథ చదివాను. కథలో కోనసీమ ప్రాంతాన్ని నేపథ్యంగా తీసుకుని ఆయన చేసిన రచన మా ఇంటిల్లిపాదినీ అలరించింది..."

బిత్తరపోయాడు సుబ్బారావు.

"కొంపదీసి పొరపాటున కథలో కోనసీమ అన్న పదాన్ని ఎక్కడా వాడలేదు కదా..." అనుకుంటూ పత్రిక తెరిచి గబగబ కథ మొత్తం మళ్ళీ చదివాడు. ఆ పదమే అందులో లేకపోవడంతో జుట్టు పీక్కున్నాడు.

వెంటనే మరో ఉత్తరం తీసాడు.

అందులో....

"సుబ్బారావుగారి 'డామిట్ కథ అడ్డం తిరిగింది' కథా నేపథ్యం ఎంతో రమణీయంగా వుంది. అందులో కోనసీమ అన్న పదాన్ని వాడకుండానే రచయిత కోనసీమ ప్రాంతాన్ని కడు మనోహరంగా వర్ణించడం మమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది..."

ఈసారి పిచ్చెక్కినట్లయింది సుబ్బారావుకి.

పాఠకుల్లో ఒక్కరు కూడా కథా నేపథ్యాన్ని అప్పాపురంగా గుర్తించకపోవడంతో ఏడుపొచ్చినంత పనైంది అతనికి. ఆ తరువాత ఎన్ని ఉత్తరాలు తిరగేసినా అన్నిట్లోనూ అదే అభిప్రాయం వుండడంతో చాలా ఆశ్చర్యమేసిందతనికి. పైగా రీడర్స్‌లో ఎక్కువమంది తన ప్రాంతానికి చెందినవారుకూడా వుండడంతో ఏమీ పాలుపోలేదతనికి.

మిగిలిన ఉత్తరాల్ని చదవడం అనవసరమని నిర్ణయించుకుని చాలా కోపంగా వాటిని డస్ట్‌బిన్‌లో పడెయ్యబోతూ ఆలవోకగా పత్రికాఫీసు నుంచి వచ్చిన ఉత్తరం కనబడ్డంతో ఆసక్తిగా దాన్ని ఓపెన్ చేశాడు.

అది ఆ పత్రిక ఎడిటర్ వ్రాసిన ఉత్తరం కావడంతో చాలా స్పీడ్‌గా అక్షరాల వెంట పరిగెత్తాడు.

"సుబ్బారావుగారికి! కోనసీమ నేపథ్యంగా మీరు వ్రాసిన కథ ఎంతో అద్భుతంగా వుందంటూ పాఠకులు వ్రాసిన వందలాది ఉత్తరాల్లో కొన్నింటిని మీకు రీ డైరెక్ట్ చేస్తున్నాను. పాఠకులను అంతగా ఆకట్టుకునేట్లుగా వ్రాయగలిగిన మీకు నా అభినందనలు. కోనసీమ అందాల్ని మీరు వర్ణించినంత గొప్పగా గతంలో మరే రచయితా వర్ణించలేదని నా వ్యక్తిగత అభిప్రాయం. మరీ ముఖ్యంగా అమలాపురం పేరును అప్పాపురంగా మార్చి రచించిన మీ తీరు నన్నెంతో ముగ్ధుణ్ణి చేసింది. అందుచేత కోనసీమ నేపథ్యంగానే మరో చక్కని కథను వ్రాసి మాకు త్వరలో పంపించగలరని ఆశిస్తున్నాను..."

అంతే!

గట్టిగా ఓ కేకేసి ధామ్మని పడిపోయాడు సుబ్బారావు.

అతనలా సడెన్‌గా పడిపోవడంతో మూర్తి గబగబ వచ్చి అతని మొహం మీద నీళ్ళు చల్లి లేపాడు. నీరసంగా కళ్ళుతెరిచిన అతనితో కాసిని మంచి నీళ్ళు త్రాగించాడు.

కాస్త తెప్పరిల్లిన సుబ్బారావు తన ఊరు అప్పాపురంని ఎలివేట్ చేస్తూ వ్రాసిన కథ ఇలా కోనసీమలోని అమలాపురం కథగా ఎలా మారిందో కారణాలు వెదుక్కోడానికి ప్రయత్నించాడు.

అతనికి ఏ విషయమూ బోధపడలేదు.

"కారణం నీకన్నా అర్థమయ్యిందా మూర్తీ!?..." అన్నట్లు మూర్తి కేసి చూశాడు.

ఈసారి మూర్తి ఒకేసారి అనేకమైన ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చాడు. వాటిలో అనేకానేకమైన అర్థాలు కనబడ్డాయి సుబ్బారావుకి.

'కోనసీమని కథల్లో వాడుకున్న ప్రతి రచయితా కోనసీమ ప్రాంతానికే చెందినవాడు కాడనే' అర్థాన్ని ఒక ఎక్స్‌ప్రెషన్ ఇస్తే-

మరో ఎక్స్‌ప్రెషన్ 'ప్రకృతి అనేది కోనసీమదైనా మరెక్కడిదైనా ఒక్కటే' అనే అర్థాన్నిచ్చింది.

మరో ఎక్స్‌ప్రెషన్‌లో 'పాఠకులు రచయితలకంటే తెలివిగలవారనే భావం స్ఫురిస్తే, కోనసీమ సౌందర్యం ఏ ప్రాంతం వారి సొత్తు కాదని మరో ఎక్స్‌ప్రెషన్ సూటిగా చెప్పింది.

మరో ఎక్స్‌ప్రెషన్ రచయితకి ప్రాంతీయ దురభిమానం వుండకూడదనే భావాన్నిస్తే, అన్నింటికంటే సుబ్బారావుకి ఈజీగా అర్థమయ్యే ఎక్స్‌ప్రెషన్ మరోటిచ్చి అది తన అభిప్రాయంగా తెలియజేస్తూ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు మూర్తి.

అది...

అనుభవం కంటే కూడా అనుభూతికి లోనయ్యే మంచి రచనలు చెయ్యి చ్చని!!

చివరగా, రీడర్స్ అందరికీ ఒకే విధమైన అభిప్రాయాన్ని కల్పించిన తన రచన ద్వారా సుబ్బారావుకి కలిగిన ఒకే ఒక్క అభిప్రాయం... 'డామిట్ కథ అడ్డం తిరిగింది!'.


## మిల్క్ జోక్స్

పాల విక్రయదార్ల సభ ముగిసింది.

సంఘ కార్యదర్శి శ్రీ ఎల్లప్ప వందన సమర్పణ చెబుతూ "ఈ సమావేశంలో "పాలు" పంచుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు" అన్నాడు.

సభకి హాజరైన ఒక వ్యక్తి కార్యదర్శి చమత్కారానికి మెచ్చుకుంటుంటే పక్కనున్న రాములు అన్నాడు –

"అదేం పెద్ద విశేషం... అలా మాట్లాడ్డం మావాడికి వెన్నతోపెట్టిన విద్య!"




రెయిన్‌బో డైరీ కంపెనీ బోర్డ మీటింగ్ జరుగుతోంది. గడిచిన ఆర్నెల్లలో కంపెనీ సేల్స్ పడిపోయిన విషయాన్ని బోర్డ్ మెంబర్స్ గుర్తించారు.

"పోటీ కంపెనీ తమ పాలని రంగు రంగుల ప్యాకెట్లలో అమ్ముతోంది. అందువల్లే మన మార్కెట్ షేర్‌ని చాలా వరకు ఆ కంపెనీ తన వైపు తిప్పుకోగలిగింది" అన్నాడొక మెంబర్.

"అయితే... మనం రంగు రంగుల పాలని అమ్ముదాం ఇక నించి... టిట్ ఫర్ టాట్‌లా వుంటుంది" ఉత్సాహంగా సలహా ఇచ్చాడో కుర్ర మెంబరు. ఆ సలహాకి అంతా తెల్లబోయారు.




– ఎస్. హన్మంత్రావ్